# 88. చమత్కారపు అనంతరావు

అనంతం అని, నా స్నేహితుడి కొడుకు. జర్నలిజంలో ఓ షార్టర్మ్ కోర్సుచేసి స్ట్రింగర్గా పత్రికారంగ ప్రవేశం చేసేడు. ఇంచుమించు అతగాడు జర్నలిజంలో ప్రవేశించిన రోజుల్లోనే జర్నలిజంలో గడుసురాతలూ చమక్కులూ ప్రవేశించేయి. ఆ చమత్కారాలు కొన్ని నిత్య జీవిత సంభాషణల్లోకి కూడా ప్రవేశించి, అనంతానికి వృత్తికి తగ్గ ప్రవృత్తిని సమకూర్చి పెట్టేయి.

ఇదెలాగంటేను, మర్చంట్ నేవీలో పనిచేస్తూ విదేశాల్ని చుట్ట బెట్టొచ్చే మా పిన్ని కొడుకు శ్రీనివాసరావు ఇంటికోసారి అనంతాన్ని పంపేను; అదేదో రకం కేల్కులేటర్ మా అబ్బాయి కోసం తెచ్చేడని తెలిసి. అట్నుంచొచ్చేక "మీ కజిన్ శ్రీనివాసరావు గారు చాలా గొప్పవాడండోయ్" అన్నాడు అనంతం.

"ఎంచేత అలా?" అని అడిగితే "వాళ్లింట్లో ఇంపోర్టెడ్ గుడ్స్తో బాటు ఇంపోర్టెడ్ "బేడ్స్" కూడా చాలా వున్నాయండి. అన్నాడు. అతని మాటలకి పబ్లిగ్గా నవ్వితే లేనిపోని చనువు తీసుకుంటాడేమో అన్నట్టుగా నేను వూరుకొన్నాను. "లేకపోతే యేంటండి? హాయిగా వంటింట్లో కత్తిపీట ముందేసుకుని తరుక్కోవలిసిన కూరగాయల కోసం ప్రెసిషన్-వెజిటబుల్-ఛాపింగ్-మెషిన్-ట; వెస్ట్ జర్మనీ నుంచీ తెచ్చేరు. మిరియం గింజ సైజునించి కోడిగుడ్డు సైజువరకూ ఎంతెంత ముక్కలు కావాలో గేజి సెట్చేసి స్విచ్చి వేస్తే కూరలు తరిగి పెడుతుందిట, ఆ మిషను!" అని బోధ పరిచాడు.

"వాళ్లబ్బాయి కిరణ్ బావున్నాడా?" అన్నాను మాటమార్చాలనీ.

"వాడికేమండీ? ఎర్లీ టు బ్రెడ్డు, ఎర్లీ టు రైసు!" అన్నాడు.

ఆ మధ్య ప్రీతిష్నంది అనే కవి, జర్నలిస్టు - హైద్రాబాదొస్తే అనంతానికి పరిచయం చేసేను. "ఇతనే ప్రీతిష్ నంది" అని. దానికి అనంతం స్పందన -

" నాసంగతి మీకు తెలుసుగా, మీరు నంది అంటే నందే."

అనంతానికి స్వయానా మాట విరుపులంటే సరదా. వార్తా రచనలో కొత్తరకం 'టైటిలింగు' అనగా 'హెడ్డింగులు పెట్టుట' లో అనంతానికి గొప్ప అభిరుచి. "లారీ ఢీ - ఎద్దు ఠా" నుంచి 'వీసీ సింగు గారి (క) మండల వాదం" వరకు వార్తలకు సంచలనాత్మకమైన శీర్షికలుంచడంలో గొప్ప ప్రతిభ కనపరచ గలవాడని ప్రఖ్యాతి చెందేడు. అప్పుడప్పుడు ఇతను పెట్టిన సంచలనాత్మకమైన హెడ్డింగులు సంపాదకులకీ యాజమాన్యాలకీ వెగటుగా తోచడం, దానికి ఫలితంగా అనంతం కొత్త కొలువు వెతుక్కోడం సంభవించేది. ఒకసారి జంటనగరాలలో కొత్తగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ సెంటరు గురించి వార్త వేస్తూ 'గ్రామరు తెలియని ప్రోగ్రామరు' అని టైటిలు పెట్టేడు. ఆ కంపెనీ వాళ్లు ఆ వార్తకి ప్రతిస్పందించి "కంప్యూటర్-సైన్సు "లో 'లాంగ్వేజి' ఉంటుంది గాని "గ్రామరు" ఉండదనీ ఇలాటి తలతిక్క రాతలు రాయడం అవమాన కరమనీ "రిజాయిండర్" ఇచ్చేరు. "టాంకు బండు మీద భారీగా కాల్చుకు తినడం" అని ఒక

వార్తకి అనంతం టైటిలు పెడితే పోలీసు కమీషనర్ గారు గాభరా పడిపోయి ఆ వార్తని ఇంగ్లీషులోకి అనువాదం చేయించుకున్నారు. తీరా తేలిందేమిటంటే వానాకాలం ప్రారంభం అవుతున్న రోజుల్లో టాంకు బండు మీదికి విహారానికి వచ్చిన వాళ్లకోసం వ్యాపారులు మొక్కజొన్న కండెలను కాల్చి ఇస్తూ లాభాలు సంపాదిస్తున్నారని!

ఈ రకం చమత్కారం ఓసారి అనంతం మా మేనకోడలి ఇంట్లో ప్రదర్శించ బోయాడు. నేను విశాఖపట్నం నుంచి వచ్చాననీ, మా మేనకోడలింట్లో దిగాననీ, ఓసారి వచ్చి కలవమనీ అనంతానికి ఫోన్ చేసి చెప్తే ఆ సాయంకాలం ఐదున్నరకి వస్తూనే మా మేనకోడలితో "పద్మా, నువ్వూ మీ అమ్మాయీ ఇలా వచ్చి కూర్చోండి!" అన్నాడు. సరే కదా అని కూతుర్ని కేకేసి "ఏంటి, విశేషం; మామయ్యగారూ? ఎందుకు, మేం యిద్దరం రావడం?" అంది మా పద్మ.

"కొరుక్కుతినడానికీ, వేపుకు తినడానికీ." అన్నాడు అనంతం.

ఆ మాటకి మా పద్మ చాలా నొచ్చుకుని కళ్లనీళ్ల పర్యంతం అయిపోయి నేనుకూర్చున్న లోపలి గదిలోకి వచ్చేసింది. "మామయ్యా, నీకోసం అనంతం గారొచ్చేరు." అంది.

"మరి మొహమేమిటి, అలా పెట్టేవు?" అన్నాను.

"నేనూ పాపా అతన్ని కొరుక్కుతింటామట, వేపుకు తింటామట." అని కళ్లొత్తుకుంది.

"ఓసి వెర్రిమొహమా, అతని మాటతీరే అంత! పద." అని ముందు గదిలోకి వచ్చేసరికి అనంతం సంచిలోంచి రెండు ప్లాస్టిక్ కాగితపు ప్యాకెట్లు తీశాడు. "ఇది నీకు, ఇది పాపకి" అని అందించాడు. "నువ్వు వేపుకు తింటావు. పాప కొరుక్కు తింటుంది." అన్నాడు.

ఒక ప్యాకెట్‌లో వేరుసెనగ పప్పు బెల్లం పాకం పెట్టిన "పప్పుచెక్క", రెండో దాంట్లో అప్పడాలు ఉన్నాయి.

అవి పుచ్చుకు లోపలికెళ్లి, రెండు నిమిషాల్లో ఇవతలి కొచ్చింది మా పద్మ. ఒక పెద్ద పళ్లెంలో ఏదో పెట్టి దానిమీద ఇంకో పెద్ద పళ్లెం మూతపెట్టి తెచ్చింది. అనంతం కూర్చున్న కుర్చీకి ఎదురుగా ఒక స్టూలువేసి దాని మీద ఆ కాంప్లెక్స్ అంతా వుంచింది.

"ఏదో తెచ్చేవే?" అన్నాడు అనంతం.

"నువ్వు పీక్కుతింటావని." అన్నాను; పళ్లెం మూత తెరిచీకుండా చెయ్యి అడ్డంపెట్టి.

"పీక్కు తినాలా?" అని జుట్టు పీక్కున్నాడు అనంతం. "ఏమిటి చెప్మా"

మా పద్మ చప్పట్లు కొడ్తూ నవ్వింది. నేను మూత తెరవనిచ్చేను. "ఇదా? నాకు చాలా యిష్టం" అని ఆ పనసపండు చెక్కమీద పడి (తొనలు) పీక్కు తినడం మొదలెట్టాడు అనంతం.

1988లో మా వూళ్లో పెట్టిన వ్యాపార-పారిశ్రామిక - ప్రదర్శన (ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ ఎగ్జిబిషన్) గురించి తను పనిచేస్తున్న పేపరుకి రాయడానికని అనంతం స్పెషల్ రిపోర్టరుగా వచ్చేడు. ఆ ఎగ్జిబిషన్‌లో పోస్టల్ డిపార్టుమెంటు వారు ఒక స్టాల్ పెట్టి కార్డులూ కవర్లూ స్టాంపులూ పిన్‌కోడు పుస్తకాలూ వగైరా అమ్మారు. అనంతం ఆ స్టాల్ పక్కని ఏర్పాటు చేసిన పోస్టు బాక్సు చూసి చాలా సరదా పడ్డాడు. "నేను నా రిపోర్టు ఈ గ్రౌండ్‌లో రాసేస్తాను.

పోస్టాఫీసుకి పనిగట్టుకుని వెళ్లక్కర్లేకుండా ఇక్కడే పోస్టు చెయ్యొచ్చు" అని కూడా ముచ్చట పడ్డాడు. " ఆఖరు సారిగా ఉత్తరాలు క్లియర్ చేసేవేళ: సాయంకాలం నాలుగు గంటలు!" అని వుంది అక్కడ.

సరిగ్గా నాలుగింటికి మా అనంతం కవరు పట్టుకుని అక్కడికి వెళ్లేడు. "సారీ సార్!" అన్నాడు ఖాకీ డ్రస్‌లో ఉన్న ఒక అబ్బాయి.

"ఏమిటి, మీ పోస్టు మాస్టర్ గారు టపా కట్టేశారా?" అన్నాడు అనంతం.

"ఏమండోయి. మాటలు జాగర్తగా రానియ్యండి" అన్నాడతను. ఆ తరవాత ఇతనన్న మాటకి అక్కడ పెద్ద గొడవై పోయింది. ఉత్తరాంధ్రలో "టపా కట్టెయ్యడం" అంటే చచ్చిపోడం అనే అర్థం వుందని మా అనంతానికి తెలిసింది కాదు.

మొన్న క్రిస్మస్ సందర్భంగా మెదక్‌లో జరిగే ఉత్సవాలను "కవర్" చెయ్యడానికి అనంతం అక్కడికి వెళ్లేడు. "అక్కడ మీ వసతి వగైరా ఏర్పాట్లకి మీరేం గాభరా పడక్కర్లేదు. మెదక్‌లో మన మేనేజింగ్ డైరక్టరు గారబ్బాయికి ఒక ఇండస్ట్రీ వుంది. ఆయన్ని కలవండి, చాలు" అని ఎడిటర్‌గారు అనంతానికి చెప్పేరు.

అట్నుంచొచ్చేక ఎడిటర్‌గారు అనంతాన్ని అడిగేరు. "నీ ట్రిప్ బాగా జరిగిందా? ఇబ్బంది ఏం పడలేదు కదా?"

" ఏంటోనండి. మీరు చెప్పేరు కదాని ఆ ఇండస్ట్రీకి వెళ్లేను. ఏర్పాట్ల మాట అలా వుంచి ఆ "ఎమ్డీకొడుకు" నన్ను కనీసం కూర్చోమని కూడా అన్లేదు." అన్నాడు అనంతం.

ఆ మాట చిలవలు పలవలుగా ఎలా ఎలా ఎక్కడికి కెళ్లిందో మరి. అనంతానికి మళ్లీ ఉద్యోగం పోయింది.

★

# 89. శంకరం (సం)గతులు

నేనెక్కిన బస్సులో వెనక సీట్లో కూర్చున్నాడు గావును రామచంద్రయ్య; అనకాపల్లిలో దిగిపోతూ ఉన్నప్పుడు కండక్టరు వెనక సీటులో కూర్చున్న నన్ను పలకరించేడు. "అయ్యో, ఇంతసేపూ నువ్వూ ఈ బస్సులోనే వున్నావా? ముందు తెలిసుంటే ఇద్దరం వో దగ్గిర కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం చేసేవాళ్లం సుమీ"

"పోన్లే ఇప్పుడేం పోయింది? ఇక్కడ దిగిపోవలసినంత గండ కత్తెర లేకపోతే నాతోబాటు నరిసీపట్నం ఒచ్చి. కబుర్లు చెప్పుకుంటూ పోదాం. రేపు తెల్లారి ఫస్టుబస్‌లో వొచ్చేద్దాం." అన్నాను.

"నాకాయోగ్యత లేదు. ఇవాళ ఇక్కడ ఓ కేసు వాదించాలి. అదృష్టం అంతా నీదే" అన్నాడు రామచంద్రయ్య.

"యోగ్యతా, అదృష్టం; అంటున్నావు. నేనూ నీలాగే డ్యూటీమీద అఘోరిస్తున్నాను."